

మల్లన్న ఆస్తులకు రక్షణేది?

ఖమ్మంలోని శ్రీ గుంటు మల్లేశ్వరస్వామి ఆలయానికి చెందిన భూములతో పాటు వ్యాపార సముదాయాలను కొందరు ఆక్రమించుకున్నారు. 8లో



బోనమెత్తిన భక్తులు

ఆషాఢ మాసం ఆదివారం సందర్భంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో అమ్మవార్లకు భక్తులు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. 9లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
30° / 24°

జిల్లాలో సోమవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. సాయంత్రం తర్వాత అక్కడక్కడా జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జిల్లాలో నేడు డిప్యూటీ సీఎం భట్టి పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్/మధిర: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సోమవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 8.30 గంటలకు హైదరాబాద్ ప్రజాభవన్ నుంచి బయలుదేరి మధ్యాహ్నం 12 గంటలకు చింతకాని చేరుకుంటారు. అక్కడ దళితబంధు యూనిట్లు పంపిణీ చేసి, లబ్ధిదారులతో సమావేశమవుతారు. మధ్యాహ్నం 1.15 గంటలకు బోనకల్ చేరుకుని లబ్ధిదారులకు రేషన్‌కార్డులు పంపిణీ చేస్తారు. 4.30 గంటలకు మధిర చేరుకుంటారు. రాత్రి అక్కడే బస చేసి మంగళవారం ఉదయం 7.30 గంటలకు తిరిగి హైదరాబాద్ వెళతారు.

ఉమ్మడి జిల్లాలో నేడు, రేపు తుమ్మల పర్యటన

ఖమ్మంఅర్బన్: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమ, మంగళవారాల్లో ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. సోమవారం ఉదయం 8.30 గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరి 11.30 గంటలకు ఖమ్మం 31వ డివిజన్‌లో మోడ్రన్ మార్కెట్ యార్డు ఆధునీకీకరణ పనులు పరిశీలిస్తారు. మంగళవారం ఉదయం 10 గంటలకు కొత్తగూడెంలోని ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ క్యాంపస్, ఎంఈ కాంప్లెక్స్‌ను సందర్శించి, అక్కడ జరిగే సమావేశంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 1.30 గంటలకు కొత్తగూడెం నుంచి బయలుదేరి 3 గంటలకు రఘునాథపాలెం మండలం పరికలబోడు తండాకు చేరుకుంటారు. అక్కడ చింతగుర్తి రోడ్డుకు శంకుస్థాపన చేస్తారు. సాయంత్రం 4 గంటలకు ఖమ్మం క్యాంప్ కార్యాలయంలో మైనారిటీలతో సమావేశం నిర్వహిస్తారని క్యాంప్ కార్యాలయం నుంచి ప్రకటన వెలువడింది.

సాగర్ నుంచి పాలేరుకు నీరు..



నీటి సరఫరాను పరిశీలిస్తున్న ఎస్ఈ

ఖమ్మంఅర్బన్ /కూసుమంచి : జిల్లాలో తాగునీటితో పాటు ఇతర అవసరాల కోసం సాగర్ ప్రధాన కాల్వకు నీటి విడుదల ప్రారంభమైంది. సాగర్ డ్యామ్ నుంచి పాలేరు రిజర్వాయర్‌లోకి రెండు వేల క్యూసెక్కుల నీరు విడుదల చేయగా, దిగువకు 1000 క్యూసెక్కులు మళ్లించినట్లు జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. ఒకవైపు కూసుమంచి వద్ద సాగర్ ప్రధాన కాల్వపై గతంలో దెబ్బతిన్న యూటీ మరమ్మతు పనులు కొనసాగిస్తూనే నీరు విడుదల చేస్తున్నామని ఎస్ఈ ఎం. వెంకటేశ్వర్లు తెలిపారు. పాలేరు దిగువకు నీటి విడుదల కొనసాగింపును ఆదివారం ఆయన పరిశీలించి ఇంజనీర్లకు పలు సూచనలు చేశారు. అవసరాన్ని బట్టి దిగువకు మరింతగా పెంచుతామని, రైతుల నుంచి ప్రస్తుతం నీటి కోసం ఒత్తిడి రావడం లేదని చెప్పారు. ప్రస్తుతం రిజర్వాయర్ నీటిమట్టం 15.85 అడుగులకు చేరగా అది క్రమంగా పెరగనుంది. పాలేరు నుంచి ఎడమ కాల్వకు 710 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా పాలేరు కాల్వ ద్వారా మరో 230 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ప్రాజెక్టు ద్వారా తాగునీటి అవసరాల నిమిత్తం మరో 135 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ఉపాధ్యాయుడికి జాతీయ పురస్కారం

ఖమ్మంరూరల్: మండలంలోని మంగళగూడెం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు, కవి, రచయిత ఐలయ్యకు జాతీయ భారతి విభూషణ్ పురస్కారం లభించింది. కరీంనగర్ ఫిలిం భవన్‌లో ఆర్యాణి సకల కళా వేదిక గౌతమేశ్వర సాహితీ కళా సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఈ అవార్డు అందుకున్నారు. అవార్డుతో పాటు బంగారు పతకం, ప్రశంసాపత్రం అందించి సత్కరించారు. ఐలయ్యకు పురస్కారం లభించడం పట్ల ఎంఈఓ శ్రీనివాసరావు, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

రామయ్యకు సువర్ణ పుష్పార్చన

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామివారి దేవస్థాన అంతరాలయంలోని మూలమూర్తులకు ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి స్వామివారిని పల్లకీ సేవగా చిత్రకూట మండపానికి తీసుకొచ్చారు. అనంతరం అర్చకులు స్వామివార్లకు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు.

స్థానిక సన్నాహాలు

పరిషత్, పంచాయతీ స్థానాలు తేలడంతో ఎన్నికలపై దృష్టి

- పోలింగ్ సామగ్రి సరిచూసుకుంటున్న యంత్రాంగం
- ఎన్ని విడతలుగా నిర్వహించాలనే అంశంపై కసరత్తు
- నోటిఫికేషన్ వస్తే ఊపందుకోనున్న పనులు



జిల్లా పరిషత్ గోదాంలో ఎన్నికల సామగ్రి, బ్యాలెట్ బాక్సులను పరిశీలిస్తున్న డీపీఓ ఆశాలత, ఏఓ రాజేశ్వర్

సాక్షిప్రతినిధి, ఖమ్మం: స్థానిక సంస్థల సమరానికి అధికారులు అన్నీ సిద్ధం చేస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ ఎప్పుడైనా విడుదలవుతుందనే ఉద్దేశంతో ముందస్తు ఏర్పాట్లపై దృష్టి పెట్టారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఫైల్ ప్రభుత్వం నుంచి గవర్నర్ వద్దకు వెళ్లగా అక్కడ ఆమోదం పొందగానే ఎన్నికల షెడ్యూల్ వెలువడుతుందనే ప్రచారం జరుగుతోంది. ఈలోపే ఎన్నికల తంతుపై అధికారులు ఒక్కో పని పూర్తి చేస్తున్నారు. ప్రస్తుతం పోలింగ్ స్టేషన్లు, బ్యాలెట్ బాక్స్‌లు, ఎన్నికల సామగ్రి అందుబాటులో ఉన్నాయి. ఇంకా ఎన్నికల సామగ్రి ఎంత అవసరమనే దానిపై లెక్కలు తీశారు. ఇప్పటికే స్ట్రాంగ్‌రూమ్‌ల్లో భద్రపరచిన సామగ్రి పూర్తిస్థాయిలో పనిచేస్తోందా లేదా తనిఖీ చేయాలని ఇటీవల పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు ఆదేశించిన నేపథ్యంలో జిల్లా అధికారులు ఈ మేరకు తనిఖీలు చేపడుతున్నారు.

జిల్లాకు చేరిన బ్యాలెట్ పేపర్లు..

పరిషత్, పంచాయతీ ఎన్నికల్లో ఏవి ముందు జరుగుతాయనే చర్చ అటుంచితే.. ఈ రెండు ఎన్నికలకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు 1,569 పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. అలాగే 3,150 బ్యాలెట్ బాక్స్‌లు సిద్ధం చేశారు. బ్యాలెట్ పత్రాలు కూడా ఇప్పటికే జిల్లాకు చేరుకోగా స్ట్రాంగ్‌రూమ్‌ల్లో భద్రపరిచారు. ఈ ఎన్నికలకు సిబ్బందిని ఎంపిక చేయాలని కలెక్టర్లకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలో 10,330 మంది పోలింగ్ సిబ్బంది అవసరమని తేల్చిన అధికారులు.. పీఓ, ఏపీఓ, ఓపీఓలను ప్రాథమికంగా గుర్తించారు. పార్టీ గుర్తులపై ఈ ఎన్నికలు జరగనుండడంతో అధికార యంత్రాంగం అన్నింటిపైనా ప్రత్యేక శ్రద్ధ పెట్టింది.

ఎన్నికలు ఎన్ని విడతలో..?

పరిషత్, పంచాయతీ ఎన్నికలు ఈ సారి జిల్లాలో ఎన్ని విడతల్లో జరుగుతాయనేది నోటిఫికేషన్ విడుదలైతేనే తేలనుంది. గతంలో పంచాయతీ ఎన్నికలే ముందుగా నిర్వహించారు. 2019లో మూడు విడతలుగా గ్రామపంచాయతీ ఎన్నికలు జరిపించారు. అయితే ఈసారి రెండువిడతల్లోనే పూర్తి చేయాలనే ఉద్దేశంతో ఎన్నికల సంఘం ఉన్నట్లు చర్చ జరుగుతోంది. ఈ ఎన్నికలకు కావాల్సిన బ్యాలెట్ బాక్స్‌లను అధికారులు సిద్ధం చేశారు. జిల్లాలో 571 గ్రామపంచాయతీలకు గాను 5,214 వార్డులు, అదే సంఖ్యలో పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. ఈ ఎన్నికలకు ప్రస్తుతం అధికారుల వద్ద 3,146 బ్యాలెట్ బాక్స్‌లు సిద్ధంగా ఉన్నాయి. రెండు విడతల్లో ఎన్నికలు నిర్వహిస్తే 2,607 బాక్స్‌లు సరిపోతాయి. మిగిలినవి ఎక్కడైనా అవసరమైతే వాడుకుంటారు. మొదటి విడత ఎన్నికలు ముగిసిన తర్వాత.. రెండో విడత పోలింగ్ స్టేషన్లకు బ్యాలెట్ బాక్స్‌లు తరలిస్తారు.

ఏవి.. ఎలా ఉన్నాయి...

గత ఎన్నికల్లో ఎదురైన సమస్యలు, అనుభవాలను దృష్టిలో పెట్టుకుని వచ్చే ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు లేకుండా ఉండేందుకు పక్కా ప్రణాళిక ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. పంచాయతీ, పరిషత్‌ల పాలక వర్గాల గడువు ముగిసినప్పటి నుంచి ఎప్పుడైనా ఎన్నికలు జరగొచ్చనే ఉద్దేశంతో అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసుకుంటూ వచ్చింది. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల అమలు చేయాలన్న నేపథ్యంలో పంచాయతీరాజ్ చట్ట సవరణ పెండింగ్‌లో పడింది. దీంతో ఈ ఎన్నికలు ఆలస్యం అవుతూ వస్తున్నాయి. అయితే గతంలో చేసుకున్న ఏర్పాట్లలో.. పోలిగ్ బాక్సులు, ఇతర సామగ్రి పని తీరు, ఇంకా ఏమైనా అవసరం ఉన్నాయా..? అని తనిఖీలు చేయిస్తున్నారు. మొత్తంగా నోటిఫికేషన్ వస్తేనే ఎన్నికల తంతు ఊపందుకోనుంది.

స్థానాలు ఖరారు..

జిల్లాలో 20 జెడ్పీటీసీ, 20 ఎంపీపీ, 283 ఎంపీటీసీ స్థానాలను ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఖరారు చేసింది. ఈ ప్రకటనతో త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయనే ప్రచారం ఊపందుకుంది. మరోవైపు హైకోర్టు కూడా సెప్టెంబర్ 30లోగా స్థానిక ఎన్నికలను పూర్తి చేయాలని తీర్పు వెల్లడించిన విషయం తెలిసిందే. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని పార్టీల నాయకులు, అధికారులు ఎన్నికలకు సిద్ధం అవుతున్నారు. అలాగే ప్రభుత్వం, ఎన్నికల సంఘం నుంచి వచ్చే ఆదేశాల మేరకు అధికారులు ఒక్కొక్కటిగా ఏర్పాట్లను చక్కబెడుతున్నారు. పరిషత్ ఎన్నికలే ముందు నిర్వహిస్తారనే ప్రచారం జరుగుతోంది. అధికారులు మాత్రం ఈ రెండు ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేస్తున్నారు.

అటవీ ఆక్రమణలను ఉపేక్షించం

డీఎఫ్ఓ సిద్దార్థ్ విక్రమ్ సింగ్



చిన్నారులతో కలిసి మొక్క నాటుతున్న డీఎఫ్ఓ

ఖమ్మంవ్యవసాయం: అటవీ భూముల ఆక్రమణ, అటవీ అధికారులు, సిబ్బందిపై దాడులు చేసిన వారిని ఉపేక్షించేది లేదని జిల్లా అటవీ శాఖాధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం అటవీ డివిజన్ పరిధిలోని కారేపల్లి రేంజ్‌లోని చీమలపాడు రిజర్వ్ ఫారెస్ట్ అటవీ భూమి 50 హెక్టార్లలో 2020 – 21లో రూ. 59.54 లక్షల వ్యయంతో మొక్కలు నాటామని తెలిపారు. ఎర్రబోడు, మాణిక్యారం గ్రామాలకు చెందిన కొందరు ఈ రిజర్వ్ ఫారెస్టులో పెరుగుతున్న రూ. 45.30 లక్షల విలువైన 33,848 చెట్లను 2022 నుంచి 2025 వరకు ధ్వంసం చేశారని వివరించారు. ఈ ఘటనలో 40 మందిపై కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు. కాగా, ఆక్రమణల నిరోధానికి ఈ నెల 16న మహిళా అధికారిణి శిల్ప, బీఆర్ పురం సెక్షన్ అధికారి చక్రవర్తి అడవిలోకి వెళ్లగా ఆక్రమణదారులు సిబ్బందిపై కారంపొడి, రాళ్లతో దాడి చేశారని, అంతేగాక రూ. 3.91 లక్షల విలువైన 2,775 మొక్కలను ధ్వంసం చేశారని తెలిపారు. ఈ ఘటనలో 16 మందిపై కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు.

ప్రతిభను గుర్తిస్తేనే విజయం..

ఖమ్మంఅర్బన్ : సమాజంలో ఉన్నత స్థాయికి ఎదగాలంటే ఇతరులతో కాకుండా ఎవరికి వారే తమలోని ప్రతిభను గుర్తించుకుంటూ పోటీ పడితేనే విజయం సాధ్యమని డీఎఫ్ఓ సిద్దార్థ్ విక్రమ్ సింగ్ అన్నారు. నగరంలోని వెలుగుమట్ల అటవీ పార్కులో సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం తలసేమియా బాధిత చిన్నారులకు నోట్‌పుస్తకాలు, ప్యాడ్‌లు, మందులు, జ్యూట్ బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అర్బన్ పార్క్‌లో చిన్నారులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం డీఎఫ్ఓ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు పిల్లల వైఫల్యాలపై కాకుండా ప్రతిభపై దృష్టి పెట్టాలని, వారి లక్ష్య సాధనకు మార్గనిర్దేశం చేయాలని సూచించారు. సంకల్ప స్వచ్ఛంద సంస్థ వంటి ఎన్జీఓలు ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూడకుండా పని చేస్తున్నాయని అభినందించారు. సంస్థ వ్యవస్థాపకురాలు అనిత మాట్లాడుతూ.. తలసేమియా చిన్నారులకు అటవీ అధికారులు అండగా నిలవడం హర్షణీయమన్నారు. భోజన ఏర్పాటుతో పాటు నోట్‌పుస్తకాలు, ప్యాడ్‌లు అందించిన అధికారిణి మమతకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ నాగేశ్వరరావు, సంస్థ ఉపాధ్యక్షురాలు పి.పావని, పి.ఉదయ్‌భాస్కర్, పి.రవిచందర్, పర్యావరణ అవార్డు గ్రహీత అరుణ పాల్గొన్నారు.

కమ్యూనిజం అజేయం

సీపీఐ జిల్లా మహాసభలో హేమంతరావు



మాట్లాడుతున్న హేమంతరావు (ఇన్‌సెట్) దండి సురేష్

మధిర: సమాజంలో ఆర్థిక అసమానతలు ఉన్నంతవరకు కమ్యూనిస్టుల పోరాటం కొనసాగుతుందని, కమ్యూనిజం అజేయమని సీపీఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు అన్నారు. మధిరలో నిర్వహిస్తున్న సీపీఐ జిల్లా మహాసభల ముగింపు సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిస్టు సానుకుల పవనాలు వీస్తున్నాయని, శ్రీలంకలో 0.5 శాతం మాత్రమే ఓట్లు సాధించిన కమ్యూనిస్టు పార్టీ.. ఆ తర్వాత ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిందని అన్నారు. దేశంలో బీజేపీ నిరంకుశ పాలన సాగిస్తోందని, మావోయిస్టుల ఏరివేత పేరుతో అమాయక ఆదివాసీలను హతమారుస్తోందని ఆరోపించారు. ఇప్పుడు ఎన్నికల కమిషన్‌ను తన జేబు సంస్థగా మార్చుకుని, విపక్ష ఓటర్లను తొలగించే పనిలో ఉందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమల్లో జాప్యం చేస్తోందని, దీంతో ప్రజల్లో అసంతృప్తి ఏర్పడుతోందని చెప్పారు. కాంగ్రెస్ గెలుపులో కీలకంగా వ్యవహరించిన సీపీఐ పట్ల మిత్ర ధర్మం పాటించాలని కోరారు. సభలో నాయకులు మహ్మద్ మౌలానా, ఎర్రా బాబు, జానీమియా, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, సిద్ధినేని కర్ణకుమార్, అజ్మీరా రామ్మూర్తి, మందపు రాణి, దొండపాటి రమేష్, యంగల ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కార్యదర్శిగా సురేష్..

సీపీఐ జిల్లా నూతన కార్యదర్శిగా దండి సురేష్, సహాయ కార్యదర్శిగా జమ్ముల జితేందర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మహాసభల్లో 91 మందితో కౌన్సిల్‌ను, 29 మందితో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా ఎన్నికైన దండి సురేష్ ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురానికి చెందినవారు. ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శిగా పనిచేశారు. సహాయ కార్యదర్శి జితేందర్ రెడ్డి చింతకాని మండలం నాగిలిగొండలో జన్మించారు. విద్యార్థి, యువజన ఉద్యమాల్లో పనిచేసిన ఆయన రాష్ట్ర రైతు సంఘంలో సుదీర్ఘకాలం జిల్లా, రాష్ట్ర బాధ్యతలు నిర్వర్తించారు. వీరిని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తదితరులు అభినందించారు.

సర్కారు భూములు హాంఫట్



ఆక్రమణకు గురైన ఏదులాపురం చెరువు ప్రాంతం (ఇన్‌సెట్) పెదతండా వద్ద 33 అడుగులకు బదులు ఐదు అడుగులకు కుచించుకుపోయిన పంట కాల్వ

- 33 అడుగులున్న సాగర్ కాల్వకు నామరూపాల్లేవు..
- ఏదులాపురం చెరువు ఆక్రమణపైనా చర్యలు శూన్యం
- మంత్రి హెచ్చరించినా కదలని అధికారులు

ఖమ్మంరూరల్: ఖమ్మం నగరానికి కూతవేటు దూరంలో ఉన్న రూరల్ మండలంలో ఎంతో విలువైన ప్రభుత్వ భూములు ఐదారేళ్లుగా ఆక్రమణదారుల పరమవుతున్నాయి. అయినా అధికారులు పట్టించుకోకపోవడంతో వారు మరింతగా రెచ్చిపోయారు. ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారితో పాటు సహకరించిన అధికారులను కూడా వదలేది లేదని ఇటీవల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరించడంతో ఇప్పుడు అక్రమార్కులు బెంబేలెత్తుతున్నారు. ఖమ్మం రూరల్ మండలంలో ఎన్నెస్పీ కాల్వ భూములు, మున్నేరు పక్కన గల ప్రభుత్వ భూమి ఆక్రమణతో పాటు బఫర్ జోన్‌లో ప్లాట్లు చేశారు. ఇప్పుడు ప్రభుత్వం విచారణ జరిపితే తమ పరిస్థితేంటని వారంతా మథనపడుతున్నారు.

రియల్టర్లు, అధికారులదే హవా..

అప్పటి అధికార పార్టీ నాయకుల అండతో కొందరు రియల్టర్లు రెచ్చిపోయి ఎక్కడ ప్రభుత్వ భూమి కనిపిస్తే అక్కడ వాలిపోయేవారు. అధికారులను భయపెట్టో, మచ్చిక చేసుకునో తమ పని కానిచ్చేవారు. ఇలా రూరల్ మండలంలోని మంగళగూడెంలో ఎకరాల కొద్దీ ప్రభుత్వ భూమిని ఆక్రమించుకోగా, ఈ వ్యవహారంలో నాటి రెవెన్యూ అధికారుల అండదండలు ఉన్నాయనే ఆరోపణలు వచ్చాయి. గుదిమళ్ల పరిధిలోని మున్నేరు పక్కన కొందరు ప్రభుత్వ భూమిని ఆక్రమించి వెంచర్ వేయగా అప్పట్లో పెద్ద దుమారమే లేచింది. ఇక పెదతండా, ఏదులాపురం, ముత్తగూడెం ఏరియాల్లోనూ పొలాలకు వెళ్లే సాగర్ కెనాల్‌ను సైతం ఆక్రమించి కాల్వ నామరూపాల్లేకుండా చేశారు. 33 అడుగులు ఉండాల్సిన కాల్వ ఇప్పుడు అసలే లేకుండా చేశారు. ఏదులాపురంలోని ఆటోనగర్‌లో ఓవెంచర్ నిర్వాహకుడు 33 అడుగుల కాల్వను మొత్తం ఆక్రమించి దానిపై సిమెంట్ పైపులు వేసి వెంచర్‌కు దారి ఏర్పాటు చేసుకున్నాడు. పెదతండా, ఏదులాపురం, గొల్లగూడెం, ముత్తగూడెం, వరంగల్ క్రాస్‌రోడ్ ప్రాంతాల్లో కాల్వల ఆక్రమణ ఎక్కువగా ఉంది. దీంతో పొలాలకు నీరందక ఆ ప్రాంత రైతులు ఇబ్బంది పడుతున్నారు.

చెరువునూ వదల్లేదు..

ఏదులాపురం చెరువు భూమి దాదాపు ఐదెకరాలు ఆక్రమణకు గురైందని గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేయగా వారు విచారణ చేపట్టి ఆక్రమణలు నిజమేనని గుర్తించారు. కానీ ఇంతవరకు ఆ భూమిని స్వాధీనం చేసుకోకపోగా, ఆక్రమార్కుల పైనా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ప్రభుత్వ భూములను అక్రమార్కులకు కట్టబెట్టడంలో కొందరు రెవెన్యూ, పంచాయతీ అధికారుల పాత్ర ఉందనే ఆరోపణలు వెల్లువెత్తుతుండగా దీనిపై సరైన విచారణ చేస్తే అసలు విషయం బయటపడే అవకాశం ఉందని అంటున్నారు. ప్రభుత్వ భూమి ఆక్రమించిన వారు ఎంతటి వారైనా తిరిగి సర్కారుకు అప్పగించాలని, ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని స్వయంగా మంత్రి పొంగులేటి ఆదేశించినా యంత్రాంగానికి మాత్రం చీమ కుట్టినట్టు కూడా లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆక్రమణకు గురైన భూమిని తిరిగి స్వాధీనం చేసుకుని హద్దులు ఏర్పాటు చేయాలని గత, ప్రస్తుత కలెక్టర్లు ముజమ్మిల్‌ఖాన్, అనుదీప్ దురిశెట్టి ఆదేశించినా అధికారులు ఇంతవరకూ ఆ పని చేయకపోవడం గమనార్హం.

ప్రభుత్వ భూమి ఆక్రమిస్తే కఠిన చర్యలు

ప్రభుత్వ భూమి ఎవరు ఆక్రమించినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎక్కడెక్కడ ప్రభుత్వ భూములు ఉన్నాయి, అవి ఎవరి పరిధిలో ఉన్నాయనే వివరాలు సేకరిస్తున్నాం. ఏదులాపురం చెరువు ఆక్రమణకు గురైన విషయంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్వే చేస్తున్నాం. ప్రస్తుతం సర్వేయర్లు శిక్షణలో ఉన్నందున సర్వే నిలిచిపోయింది. శిక్షణ అనంతరం సర్వే పునఃప్రారంభించి చెరువు హద్దులను గుర్తిస్తాం. ఆక్రమణకు గురైన భూమిని స్వాధీనం చేసుకుంటాం.

– పి.రాంప్రసాద్, ఖమ్మం రూరల్ తహసీల్దార్

నేటి ప్రజావాణి రద్దు

ఖమ్మం సహకారనగర్ : బోనాల పండుగను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం సోమవారం సెలవు ప్రకటించటంతో కలెక్టరేట్‌లో నేడు నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని, కలెక్టరేట్‌కు వినతులు ఇచ్చేందుకు ఎవరూ రావొద్దని కోరారు.

ఆనాటి నిర్లక్ష్యం.. రూ.6కోట్ల భారం!

అధికారుల నిర్లక్ష్యంతో సింగరేణి సంస్థపై అదనపు భారం పడుతోంది. పర్యవేక్షణ కొరవడి నాసిరకంగా నిర్మించిన సీహెచ్‌పీ(కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్) మరమ్మతులకు మళ్లీ రూ. కోట్లు వెచ్చించాల్సి వస్తోంది. అప్పటి అధికారుల కమీషన్ల కక్కుర్తి కారణంగా సత్తుపల్లిలో నిర్మించిన బంకర్‌లో పగుళ్లు రావడంతో బొగ్గు రవాణాకు తీవ్ర అంతరాయం వాటిల్లుతోంది.

– సింగరేణి(కొత్తగూడెం)

- రూ.398 కోట్లతో నిర్మించిన సీహెచ్‌పీలో నాణ్యతలేమి
- బంకర్లలో పగుళ్లపై విచారణలో వెల్లడైన లోపాలు
- సింగరేణిలో గత అధికారుల పర్యవేక్షణపై అనుమానాలు
- మరమ్మతులకు టెండర్ పిలిచిన యాజమాన్యం



సత్తుపల్లిలోని జేవీఆర్ సీహెచ్‌పీ

ప్రారంభించిన ఆరు నెలలకే పగుళ్లు..

సింగరేణి సంస్థ పరిధిలోని కొత్తగూడెం ఏరియాలో ప్రతి నెలా దాదాపు 13 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేస్తున్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో 145 లక్షల టన్నుల ఉత్పత్తి సాధించి 11 ఏరియాల్లో కొత్తగూడెం అగ్రస్థానంలో నిలిచింది. ఏరియాలోని సత్తుపల్లిలోని జేవీఆర్, కిష్టారం ఓసీల నుంచి నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి అవుతోంది. ఇక్కడి నుంచి రవాణా సక్రమంగా సాగితే కంపెనీ నిర్దేశించుకున్న లక్ష్యాలను సులువుగా చేరుకోవచ్చనే ఆలోచనతో యాజమాన్యం సీహెచ్‌పీని నిర్మించింది. ఇందుకోసం సమంత కంపెనీకి రూ.398 కోట్లతో టెండర్ కట్టబెట్టింది. పనులు దక్కించుకున్న సంస్థ రెండున్నరేళ్లపాటు నిర్మాణ పనులు సాగించింది. సుమారు ఏడాదిన్నర క్రితం సీహెచ్‌పీ అందుబాటులోకి రాగా రైలు ద్వారా బొగ్గు రవాణా చేస్తున్నారు. కానీ ప్రారంభించిన ఆరు నెలలకే నాణ్యతాలోపాలు వెలుగుచూశాయి. సీహెచ్‌పీ బంకర్‌లో పగుళ్లు ఏర్పడ్డాయి. దీంతో ఏడాది నుంచి బొగ్గు రవాణాకు ఆటంకం కలుగుతోంది. రోజుకు 10 రేక్‌ల తరలించాల్సి ఉండగా, పగుళ్ల కారణంగా అతి కష్టంపై 5–6 రేక్‌లు కూడా దాటడం లేదు. వెరసి లక్ష్యం మేరకు ఉత్పత్తి సాగుతున్నా వినియోగదారులకు సకాలంలో బొగ్గు అందించలేకపోతున్నారు.

సరిపడా మెటీరియల్ కూడా వాడలేదు..

జేవీఆర్, కిష్టారం ఓసీల నుంచి బొగ్గును రైలు మార్గం ద్వారా రవాణా చేసేందుకు 8 వేల టన్నుల కెపాసిటీ కలిగిన మూడు బంకర్లను నిర్మించారు. వాటిలో ఒక బంకర్‌లో పూర్తిగా, మరో బంకర్‌లో పాక్షికంగా పగుళ్లు వచ్చాయి. 8 వేల టన్నుల సామర్థ్యానికి సరిపడా మెటీరియల్ వాడాల్సి ఉండగా, కేవలం 6 వేల టన్నులకు తగిన మెటీరియలే వాడారని, అందుకే బంకర్‌లో బీటలు ఏర్పడ్డాయని కార్మికులు ఆరోపిస్తున్నారు.

మెయింటెనెన్స్ నిర్మాణ సంస్థదా? సింగరేణిదా?

సాధారణంగా పనులు పూర్తై అప్పగించాక కొన్నేళ్ల పాటు నిర్మాణ సంస్థే మెయింటెనెన్స్‌కు బాధ్యత వహించాలి. కానీ టెండర్ అగ్రిమెంట్‌లో మెయింటెనెన్స్ విషయం పేర్కొన్నారా? లేదా అనే విషయం బహిర్గతం కావడంలేదు. పగుళ్లు ఏర్పడ్డా సదరు సంస్థ పట్టించుకోవడంలేదు. బీటల కారణంగా బంకర్ ఏడాది నుంచి నిరుపయోగంగా మారింది. ఇందుకు మరమ్మతులు చేపట్టేందుకు మరో రూ. ఆరు కోట్ల వరకు ఖర్చు అయ్యే అవకాశం ఉంది. ఈ పనుల రెన్యువేషన్ సింగరేణి యాజమాన్యం టెండర్లు పిలిచింది.

బాధ్యులపై చర్యలేవి?

రూ. 398 కోట్లతో చేపట్టిన పనులను ఆనాటి ఏరియా ఉన్నతాధికారి, సివిల్, క్వాలిటీ, విజిలెన్స్ అధికారులు పట్టించుకోలేదని కార్మికులు ఆరోపిస్తున్నారు. పనుల్లో నాణ్యత లోపించినా సింగరేణి విజిలెన్స్ ఎందుకు గుర్తించలేదనే ప్రశ్న కూడా ఉత్పన్నమవుతోంది. కనీసం 60 ఏళ్ల వరకు పటిష్టంగా ఉండాల్సిన సీహెచ్‌పీకి రెండేళ్లకే మరమ్మతులు చేపట్టాల్సివస్తోంది. ఈ నేపథ్యంలో సీహెచ్‌పీ మనుగడ నీలినీడలు అలుముకుంటున్నాయి. ఇందుకు కారణమైన అప్పటి అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని కార్మికులు, కార్మిక నాయకులు ప్రశ్నిస్తున్నారు.

డిజైన్‌లోనే లోపం

నిర్మాణ పనులను అప్పటి జీఎం, ఇతర విభాగాల అధికారులు పర్యవేక్షించకుండా కాంట్రాక్టర్ నుంచి కమీషన్లు దండుకున్నారని కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో ఆరు నెలలకే సీహెచ్‌పీ బంకర్‌లో బీటలు వారాయని పేర్కొన్నారు. పగుళ్లు ఏర్పడి కూలేందుకు సిద్ధంగా ఉంటుందని చెబుతున్నారు. ఈ విషయమై సంస్థ సెంట్రల్ మైనింగ్ ప్లానింగ్ అండ్ డిజైన్ ఇన్‌స్టిట్యూట్ ద్వారా విచారణ జరిపించగా డిజైన్‌లోనే లోపముందని, బంకర్ నిర్మాణానికి నాణ్యమైన సామగ్రి వాడలేదని తేలింది.

బ్లాక్ లిస్ట్‌లో పెట్టాం..

సత్తుపల్లిలోని సీహెచ్‌పీ బంకర్‌లో పగుళ్లపై విచారణ చేయించగా నిర్మాణ సంస్థ నాణ్యతా ప్రమాణాలు పాటించలేదని తేలింది. సమంత కంపెనీ సింగరేణిలో ఏ పని చేయకుండా బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాం. కోల్‌ఇండియా పరిధిలోనూ పనులు ఇవ్వొద్దని లేఖ రాశాం. సత్తుపల్లి నుంచి బొగ్గు రవాణాకు అంతరాయం ఏర్పడకుండా మరమ్మతులకు టెండర్ పిలిచాం.

– శాలేంరాజు, కొత్తగూడెం ఏరియా జీఎం

క్లుప్తంగా

రాష్ట్ర బ్యాడ్మింటన్ సింగిల్స్ టైటిల్ కైవసం


బొనం ప్రశాంస

ఖమ్మం స్పోర్ట్స్: నిర్మల్ జిల్లా కేంద్రంలో గత మూడు రోజులుగా తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో ఖమ్మానికి చెందిన బొనం ప్రశాంస రాష్ట్రస్థాయి అండర్-19 సింగిల్స్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఫైనల్స్‌లో రిషికి పాండేపై 15-12, 15-10 పాయింట్ల తేడాతో విజయం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. అంతర్జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ టోర్నీలో ప్రాతినిధ్యం వహించిన ప్రశాంస తన అనుభవంతో ఈ టైటిల్‌ను సాధించింది. ఈమేరకు డీవైఎస్‌ఓ టి.సునీల్‌రెడ్డి, జిల్లా బ్యాడ్మింటన్ సంఘం బాధ్యులు గంట వెంకట్రావు, కర్నాటి వీరభద్రం, వి.చంద్రశేఖర్, బొనం విజయ్‌లు అభినందనలు తెలిపారు.

తపాలా నూతన సాంకేతికతపై అవగాహన


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న తపాలా అధికారులు, ఉద్యోగులు

ఖమ్మంగాంధీచౌక్: దేశ వ్యాప్తంగా తపాలా శాఖలో ఈ నెల 22 నుంచి అమలు చేస్తున్న ఐటీ-2.0 నూతన సాంకేతిక విధానంపై ఖమ్మం డివిజన్ తపాలా పరిధిలోని ఉద్యోగులకు ఆదివారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఖమ్మం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ వి.వీరభద్రస్వామి మాట్లాడుతూ.. నూతన సాంకేతిక విధానంలో తపాలా సేవలు సురక్షితంగా, వేగవంతంగా సాగనున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో శిక్షకులుగా బి.హుస్సేన్, పి.శ్రీకాంత్, పుల్లారావులు వ్యవహరించారు.

దశలవారీ పోరాటాలను జయప్రదం చేయండి

ఖమ్మం సహకారనగర్: ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యాననిర్వహించనున్న దశలవారీ పోరాటాలను జయప్రదం చేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చావా దుర్గాభవాని కోరారు. ఆదివారం ఆన్‌లైన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్సీ ఇవ్వలేదని, పదోన్నతులు, బదిలీల షెడ్యూల్ ప్రకటించాలని, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, జీఓ నంబర్ 25ను సవరించాలని తదితర సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈమేరకు మొదటి దశగా ఈ నెల 23, 24 తేదీల్లో మండల కేంద్రాల్లో అధికారులకు వినతిపత్రం, రెండో దశలో ఆగస్టు 1న జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద ధర్నా, మూడో దశలో ఆగస్టు 23న చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావు, నాయకులు జీ.వీ.నాగమల్లేశ్వరరావు, బుర్రి వెంకన్న, షమీ, రాంబాబు, రాందాస్, నరసయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఖమ్మంవాసికి కోడి రామకృష్ణ ఫిల్మ్ అవార్డు


మల్లం రమేష్

ఖమ్మంగాంధీచౌక్: దేశభక్తిని చాటుతూ సందేశాత్మక చిత్రాన్ని నిర్మించి, ఆ చిత్రానికి దర్శకత్వం వహించిన ఖమ్మం నగరానికి చెందిన మల్లం రమేష్‌కు కోడి రామకృష్ణ ఫిల్మ్-2025 అవార్డు వరించింది. ఈ నెల 23న హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో అవార్డుల ప్రదానం ఉంటుందని కోడి రామకృష్ణ ఫిల్మ్ అవార్డ్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు తుమ్మలపల్లి రామకృష్ణ ప్రకటించారు. గతేడాది 'వందేభారత్'సేవ్ ఇండియా చిత్రాన్ని నిర్మించి , అందులో పోలీస్ అధికారిగా నటించిన రమేష్ ప్రజల్లో దేశభక్తిని పెంపొందించి ఉగ్రవాదాన్ని నిర్మూలించాలనే సందేశాన్ని అందించడంతో చిత్రానికి ఇంతటి గుర్తింపు లభించింది. ఉత్తమ చిత్రం అవార్డు కూడా వందేభారత్ చిత్రం దక్కించుకుంది. ఈ సందర్భంగా ఖమ్మం కళాసంస్థల ప్రతినిధులు ఆయనకు అభినందలు తెలిపారు.

అసత్య ప్రచారాలతో మోసపోవద్దు

భద్రాచలంటౌన్: విశాఖపట్నంలోని బీచ్ రోడ్‌లో అయోధ్య రెప్లికే టెంపుల్‌లో శ్రీ సీతారామచంద్రస్వామివారి కల్యాణం నిర్వహిస్తున్నట్లు వస్తున్న ప్రచారాన్ని ఎవరూ నమ్మొద్దని భద్రాద్రి దేవస్థాన ఈఓ ఎల్.రమాదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భద్రాద్రి దేవస్థానానికి చెందిన ఆస్థాన పండితులు వస్తున్నారని ప్రచారం చేసి కల్యాణం నిమిత్తం సుమారు రూ.3వేలు భక్తుల నుంచి వసూలు చేస్తున్నట్లు దేవస్థాన అధికారులకు ఓ వీడియో ద్వారా తెలిసిందని ఆమె పేర్కొన్నారు. ఈ ప్రచారంతో భద్రాచలం దేవస్థానానికి ఎటువంటి సంబంధం లేదని, దేవస్థానం వారికి తెలియకుండా ఇటువంటి కార్యక్రమం కల్యాణాలు నిర్వహించుట చట్టరీత్యా నేరమని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాల్లో పాల్గొని భక్తులు మోసపోవద్దని ఈఓ సూచించారు.

మల్లన్న ఆస్తులకు రక్షణేది?

గుంటు మల్లేశ్వరస్వామి ఆలయానికి రూ.కోట్ల విలువైన భూములు

- వీటిపై అక్రమార్కుల కన్ను
- ఆలయ ప్రాంగణంలోనూ ఆగని ఆక్రమణలు
- ఆధారాలున్నా అడ్డు తగులుతూ కొందరి దౌర్జన్యకాండ


శ్రీ గుంటు మల్లేశ్వర స్వామి దేవస్థానం


కాల్వొడ్డులో ఆక్రమణలతో కుంచించుకుపోతున్న ఆలయ భూమి

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం ట్రంక్ రోడ్‌లో గల పురాతన శైవ క్షేత్రం శ్రీ భ్రమరాంబ సమేత గుంటు మల్లేశ్వర స్వామి దేవస్థానం భక్తుల తాకిడితో ఎప్పుడూ కళకళలాడుతుంటుంది. ఈ ఆలయానికి నగరం నడిబొడ్డున రూ.కోట్ల విలువైన భూములు, ఆస్తులు ఉన్నాయి. అయితే కొందరు అక్రమార్కులు ఈ భూములు, ఆస్తులను ఇప్పటికే ఆక్రమించుకున్నారు. 400 ఏళ్ల క్రితం వ్యవసాయ భూమిగా ఉన్న ఈ క్షేత్రంలో లభించిన శివలింగం ఆధారంగా గుంటు మల్లన్న ఆలయం రూపుదిద్దుకుంది. పూర్వం ఖమ్మం ఖిల్లాను నిర్మించిన రెడ్డి రాజులే ఈ దేవాలయాన్నీ నిర్మించారని చరిత్ర చెబుతోంది. ఈ ఆలయంలో ప్రతీ మాస శివరాత్రి రోజున శ్రీ స్వామి వారి కల్యాణం నిర్వహిస్తారు. కార్తీక మాసంలో వైభవంగా ఉత్సవాలు జరుగుతాయి. మహా శివరాత్రి సందర్భంగా కనులపండువగా వేడుకలు ఉంటాయి. మూడు వేల చదరపు గజాల విస్తీర్ణంలో నిర్మించిన ఈ శైవ క్షేత్రానికి కాల్వొడ్డు కేంద్రంలో 3.07 ఎకరాలు, సుందరయ్యనగర్‌లో 4.19 ఎకరాల భూమి ఉంది. ఆలయ ప్రాంగణంలో రెండు వైపులా ఎంతో విలువైన దుకాణ సముదాయాలూ ఉన్నాయి.

ఆస్తులపై అక్రమార్కుల కన్ను

గుంటు మల్లన్న ఆస్తులపై అక్రమార్కుల కన్ను పడింది. పూర్వం వ్యవసాయ భూమిగా ఉన్న ఈ భూములు నేడు వాణిజ్య భూములుగా అవతరించడంతో వీటి విలువ రూ.కోట్లకు చేరింది. భూముల విలువ పెరగడంతో నగరానికి చెందిన కొందరు ఆక్రమణలకు పాల్పడుతున్నారు. 1939 - 40 సంవత్సరం నుంచి ఇవి ఇనాం భూములుగా, దేవాలయ మాన్యంగా పహాణీల్లో, రెవెన్యూ రికార్డుల్లో ఉంది. కానీ అక్రమార్కులు తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి ఆ భూములు తమవంటూ అనుభవిస్తున్నారు. కాల్వొడ్డులో 35, 26, 37, 38, 39, 40 సర్వే నంబర్లలో ఉన్న గుంటు మల్లన్న ఆలయ భూముల్లో అక్కడక్కడా కొన్ని ఆక్రమణకు గురయ్యాయి. ఆలయ భూముల రక్షణకు ఏర్పాటుచేసిన ఫెన్సింగ్ కూడా తొలగించి ఆక్రమణలకు పాల్పడిన ఆనవాళ్లు కూడా ఉన్నాయి. ఈ భూముల్లో దర్జాగా వ్యాపారాలు నిర్వహిస్తుండడమే కాక సొంత ఇళ్లు నిర్మించుకోవడం గమనార్హం.

దుకాణ సముదాయాలూ అంతే..

ఇనాం భూములే కాకుండా ఆలయ ప్రాంగణంలోనూ ఆక్రమణలు చోటుచేసుకున్నాయి. ఆలయం చుట్టూ వాణిజ్య ప్రాంతం కావడంతో ఇరువైపులా 14 దుకాణాలు నిర్మించారు. అయితే పూర్వం ఇక్కడున్న కొందరు, ఆలయ సంబంధీకులు ఈ దుకాణ సముదాయాలు తమవిగా హక్కు పత్రాలు సృష్టించారు. దీంతో ఆలయానికి రావాల్సిన కిరాయిలు తమ జేబుల్లో వేసుకుంటున్నారు. ఒక్కో దుకాణం నుంచి నెలకు రూ.6వేల వరకు కిరాయిలు వస్తుండగా ప్రైవేటు వ్యక్తులు అక్రమంగా అనుభవిస్తున్నారు. దీంతో ప్రతి నెలా ఆలయానికి రూ. 80 వేలకు పైగా నష్టం వస్తోంది. ఇక ఆలయ ప్రాంగణంలో ఉన్న స్థలం కూడా క్రమంగా ఆక్రమణలకు గురవుతోంది.

తప్పుడు పత్రాలతో కోర్టును నమ్మించేందుకు..

గుంటు మల్లన్న ఆస్తులు, భూములపై వివిధ కోర్టుల్లో 14 కేసులు ఉన్నాయి. ఈ ఆలయానికి చెందిన భూములను కొందరు ఆక్రమించారని, వాటిని తిరిగి ఆలయానికి దక్కించి న్యాయం చేయాలని దేవాదాయ శాఖ కోర్టులను ఆశ్రయించగా, ఆక్రమణదారులు తప్పుడు పత్రాలు సృష్టించి ఆయా భూములు తమవేనంటూ న్యాయస్థానాలను నమ్మించే ప్రయత్నాలు చేస్తున్నారు. దుకాణ సముదాయాల స్థితి కూడా ఇలాగే ఉంది. కొందరు దుకాణాలను తమ వారసులకు ఇచ్చినట్లు కూడా పత్రాలు సృష్టించారు. ఆలయానికి ధర్మకర్తల మండళ్లను నియమిస్తున్నా ఆ కమిటీలు సైతం ఆలయ భూముల రక్షణకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం దురదృష్టకరం.

భూముల రక్షణకు కృషి చేస్తున్నాం

శ్రీ గుంటు మల్లేశ్వర స్వామి ఆలయ భూములు, ఆస్తులకు సంబంధించి పూర్తి ఆధారాలు, రికార్డులు ఉన్నాయి. అయినా భూములు ఆక్రమణకు గురవుతూనే ఉన్నాయి. ఈ భూముల రక్షణకు చట్టపరంగా కృషి జరుగుతూనే ఉంది. దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆదేశాల మేరకు భూముల రక్షణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. పలు అంశాలు వివిధ కోర్టుల్లో న్యాయ విచారణలో కొనసాగుతున్నాయి. న్యాయం దేవస్థానం వైపున ఉన్నందున ఆయా భూములు, ఇతర ఆస్తులు ఆలయానికి దక్కుతాయనే నమ్మకం ఉంది.
– చుండూరు రామకోటేశ్వరరావు, ఆలయ మేనేజర్

ఆధారాలున్నా అడ్డుతగులుతూ..

ఆలయ భూములకు ఉన్న ఆధారాలతో దేవాదాయ శాఖ అధికారులు, ఉద్యోగులు వాటిని రక్షించేందుకు చర్యలు చేపడితే అర్థ బలం, అంగబలం, రాజకీయ నాయకుల అండతో కొందరు అక్రమార్కులు దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. ఆ భూములు తమవని, వాటి జోలికొస్తే తగిన శాస్తి తప్పదని బెదిరించిన ఘటనలు కూడా ఉన్నాయి.

'ఎర్త్‌సైన్సెస్'కు రేపు పరిశీలకుల రాక!


ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ

కొత్తగూడెంఅర్బన్: కేఎస్‌ఎంలోని మన్మోహన్‌సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీని ఈ నెల 22న ఇన్‌చార్జ్ వైస్ చాన్స్‌లర్ యోగితారాణా, హయ్యర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ దేవసేన, కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ సందర్శించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. యూనివర్సిటీలో సదుపాయాల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించినట్లు తెలుస్తోంది. సదుపాయాలు కల్పించాక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు సమాచారం. పరిశీలకుల బృందం పర్యటనపై యూనివర్సిటీ ప్రిన్సిపాల్ జగన్మోహన రాజును సంప్రదించగా.. తనకు సమాచారం లేదని తెలిపారు.

పండితాపురంలో చోరీ..


చెల్లాచెదురుగా పడి ఉన్న సామాన్లు

కామేపల్లి: ఇంటి తాళం వేసి ఊరెళ్లిన ఓ ఇంట్లో గుర్తు తెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని పండితాపురం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ బోడేపూడి అనురాధ ఇటీవల హైదరాబాద్‌లో ఉన్న తన కుమారుడి వద్దకు వెళ్లింది. ఈక్రమంలో ఇంట్లో ఎవరూ లేరని గుర్తించిన దొంగలు శనివారం రాత్రి గేటు, ఇంటి తాళాలు పగలకొట్టి చోరీకి పాల్పడ్డారు. ఈనేపథ్యాన ఆదివారం పని మనిషి ఇంటి ఆవరణాన్ని ఊడ్చేందుకు వెళ్లగా.. గేటు తాళాలు తీసి ఉండడంతో అనుమానం వచ్చి ఇంటి వెనకకు వెళ్లగా తలుపు పగలకొట్టి ఉంది. దీంతో చోరీ జరిగిందని గుర్తించి స్థానికులతో కలిసి ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా.. ఇంట్లోని వస్తువులు చెల్లాచెదురుగా పడేసి ఉండడంతో పాటు బీరువాలోని సుమారు నాలుగు కేజీల వెండి వస్తువులు, అభరణాలతో పాటు పట్టు చీరలను దోచుకెళ్లినట్లు గుర్తించారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన కారు..

- ఇద్దరికి గాయాలు

చింతకాని: మండలంలోని లచ్చగూడెం గ్రామ సమీపాన శనివారం ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టగా బోనకల్ మండలం తూటికుంట్ల గ్రామానికి చెందిన కంచర్ల వెంకటేశ్వర్లు, చింతకాని మండలం లచ్చగూడెం గ్రామానికి చెందిన నర్మదలకు గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం వెంకటేశ్వర్లు ఆదివారం తన ద్విచక్ర వాహనంపై తూటికుంట్ల గ్రామం నుంచి ఖమ్మం వెళ్తుండగా.. లచ్చగూడెం గ్రామంలో నర్మద అతడిని లిఫ్ట్ అడిగి ఎక్కింది. ఈక్రమంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో వారిరువురికి గాయాలు కాగా వెంకటేశ్వర్లు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

632 గ్రాములు గంజాయి స్వాధీనం

సత్తుపల్లి: గంజాయి విక్రయిస్తున్న ముగురు వ్యక్తులపై ఆదివారం కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. పట్టణ సీఐ టి.శ్రీహరి కథనం ప్రకారం.. సత్తుపల్లి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ గోడౌన్ వద్ద ఎస్సై అశోక్‌కుమార్ తన పోలీస్ సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఐదుగురు వ్యక్తులు పోలీసులను చూసి పరారయ్యేందుకు ప్రయత్నించగా .. వారిని వెంబడించి సత్తుపల్లి మండలం రేజర్లకు చెందిన జింజర్ సింహాద్రి మరో ఇద్దరు మైనర్లు పోలీసులకు పట్టుబన్నారు. సింహాద్రి ఒరిస్సా నుంచి గంజాయి కొనుగోలు చేసి వాటిని 100 గ్రాముల చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి ఒక్కో ప్యాకెట్ రూ.వెయ్యి చొప్పున విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో వ్యవసాయ మార్కెట్ వద్ద వేచి ఉన్న సింహాద్రి వద్దకు నలుగురు వ్యక్తులు బైక్‌పై వచ్చి కొనుగోలు చేస్తుండగా.. ఇదే సమయాన పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తూ వెళ్లడంతో అందులో ఇద్దరు వ్యక్తులు పరారయ్యారు. పట్టుబడిన సింహాద్రితో పాటు మరో ఇద్దరు మైనర్ల వద్ద నుంచి 632 గ్రాముల గంజాయి, ఒక మోటార్ సైకిల్, మూడు సెల్‌ఫోన్లు, రూ.వెయ్యి నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. సింహాద్రిని రిమాండ్ కోసం కోర్టుకు తరలించి మైనర్లను అదుపులో తీసుకున్నట్లు సీఐ తెలిపారు.

గంజాయి కేసులో నలుగురు అరెస్ట్

ఖమ్మం అర్బన్: ఖమ్మంఅర్బన్(ఖానాపురంహవేలీ) పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం గంజాయి కలకలం చోటుచేసుకుంది. ధంసలాపురం కాలనీ వద్ద పోలీసులు తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 75 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ భానుప్రకాశ్ తెలిపారు. అదుపులోకి తీసుకున్న నలుగురిలో ఓ యువకుడితో పాటు ముగ్గురు మైనర్లు ఉన్నారని, వీరు రిక్కాబజార్, కమాన్‌బజార్ ప్రాంతాలకు చెందినవారని చెప్పారు. గంజాయి కొనుగోలు చేసి స్వయంగా వినియోగించేందుకు తీసుకెళ్తున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైందని తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

ఖమ్మంక్రైం : బాలికను మాయమాటలతో మోసం చేసి ప్రేమ పేరుతో లోబర్చుకున్న యువకుడిపై ఖమ్మం టూటౌన్ పోలీసులు ఆదివారం పోక్సో కేసు నమోదు చేశారు. వీఎం బంజర్‌కు చెందిన తేజ ఈశ్వర్ కారు డ్రైవర్‌గా పనిచేస్తూ ఖమ్మం టూటౌన్ ప్రాంతంలో గది అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. సత్తుపల్లి మండలానికి చెందిన ఓ బాలికను ప్రేమ పేరుతో ఖమ్మంలోని తన గదికి తీసుకొచ్చి లోబర్చుకున్నాడు. దీంతో బాధితురాలి కుటుంబసభ్యులు ఫిర్యాదు చేయగా ఈశ్వర్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ బాలకృష్ణ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 44 కేసులు...

ఖమ్మం క్రైం: నగరంలో ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యాన శనివారం రాత్రి నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 44కేసులు నమోదైనట్లు ట్రాఫిక్ సీఐ బెల్లం సత్యనారాయణ తెలిపారు. ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 6 కార్లు, 2 ఆటోలు, 36 మంది మద్యం సేవించి బైక్ నడుపుతున్నట్లు గుర్తించి కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే రెండు నంబర్‌ప్లేట్ లేని బైక్‌లు, సైలెన్సర్ మార్చిన బైక్‌లను సీజ్ చేశామన్నారు. వాహనచోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడుపరాదని, నంబర్ ప్లేట్ లేకుండా, బుల్లెట్ బైకులు సైలెన్సర్ మార్చొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు రవి, రాము, సాగర్, అమీర్, అలీ, వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

దాడి ఘటనలో ఇద్దరిపై..

రఘునాథపాలెం: మండలంలోని గణేశ్వరంలో ఆదివారం ఇంటి స్థల వివాదంతో దంపతులు దాడి చేసి మహిళను గాయపరిచిన ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన కొర్రా బుజ్జి ఇంటి పక్కనే మరిది బలరాం కుటుంబం నివసిస్తోంది. ఆయన ఇంటి నిర్మాణ సమయంలో బుజ్జి ఇంటి స్థలంలోని మూడు అడుగుల మేర ఆక్రమించాడు. తాను కూడా ఇల్లు నిర్మించుకోవాలని, తన స్థలంలో చేపట్టిన నిర్మాణాన్ని తొలగించాలని కోరగా వివాదం జరిగింది. దీంతో ఆగ్రహించిన బలరాం, అతడి భార్య అనసూయ దాడి చేయడంతో బుజ్జి తల పగిలి గాయపడింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

చికిత్స పొందుతున్న యువకుడు మృతి

చింతకాని: పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ యువకుడు ఆదివారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. చింతకాని గ్రామానికి చెందిన కోల శ్యామ్(30) కారు డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన అతడు శనివారం లచ్చగూడెం గ్రామ సమీపాన కారులో తన్న అన్నకు ఫోన్ చేసి పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా ఆదివారం మృతి చెందాడు. మృతుడి అన్న కోల సైదులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

వైరా: ఉద్యోగం నుంచి తీసేశారని, ఇందిరమ్మ ఇల్లు రాలేదని ఓ యువకుడు మనస్థాపానికి గురై ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళితే.. స్థానిక శాంతినగర్‌లోని 14వ వార్డులో నివాసం ఉంటున్న నక్కా నాగరాజు గత కొంతకాలంగా స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లోని ఓ మొబైల్ షాపులో సేల్స్ బాయ్‌గా పని చేస్తున్నాడు. ఈక్రమంలో అతడిని అకారణంగా షాపు నుంచి తొలగించారు. ఇదే సమయాన తన తల్లి శ్రావణి పేరుతో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల జాబితాలో లేకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురై శనివారం రాత్రి స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ సమీపాన తన స్నేహితుడికి చెప్పి ఎలుకల మందును వాటర్ బాటిల్‌లో కలుపుకుని తాగాడు. విషయం తెలుసుకున్న స్నేహితులు వెంటనే వైరాలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. ఎస్‌ఐ రామారావు అక్కడకు చేరుకుని వివరాలు సేకరించారు. మొబైల్ షాపు నుంచి తొలగించడంతోనే ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు సమాచారం.

ఎలుకల మందు తాగి వృద్ధురాలి ఆత్మహత్య

ఖమ్మంరూరల్: అనారోగ్యంతో బాధపడలేని ఓ వృద్ధురాలు ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని ముత్తగూడెంకు చెందిన దారమళ్ల లక్ష్మీబాయమ్మ (75) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈక్రమంలో అనారోగ్య బాధను తట్టుకోలేక ఈనెల 18న రాత్రి ఎలుకల మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. మృతురాలి కుమారుడు రాంబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ ముష్కరాజు తెలిపారు.

చి'వ్రరీ' మజిలీ..

- శ్మశానంలో స్థలం కరువు
- పాతిన చోటునే మళ్లీ తవ్వుతున్న వైనం
- బయటపడుతున్న అస్థిపంజరాలు
- చెడిపోయిన చేతిపంపు


పాతిన చోటనే తిరిగి పాతిపెట్టిన దృశ్యం

నేలకొండపల్లి: ఈ గ్రామంలో చివరి మజిలీకి కష్టాలు తప్పడం లేదు. మండలంలోని గువ్వలగూడెంలో ఆదివారం ఓ దళితుడు మృతి చెందాడు. కుటుంబసభ్యులు అతడి అంతిమయాత్ర నిర్వహించి శ్మశానవాటికకు తీసుకెళ్లారు. కాగా, అందులో స్థలం లేకపోవడంతో గతంలో ఇతరులను పాతిపెట్టిన చోటనే తిరిగి అదే స్థలంలో పాతిపెట్టేందుకు బొంద తవ్వుతుండగా.. అస్థిపంజరాలు బయటపడుతున్నాయి. దీంతో వారి బంధువుల మనోభావాలు దెబ్బతింటున్నాయి. ఇదిలా ఉండగా ఇక్కడున్న చేతిపంపు చెడిపోవడంతో కనీసం కాళ్లు కడుక్కునేందుకు నీళ్లు కరువయ్యాయి. ప్రభుత్వం ఇప్పటికైనా శ్మశానవాటికకు స్థలం, కనీస సౌకర్యాలు కల్పించాలని స్థానిక దళిత సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు.

శాకాంబరీ దేవిగా పెద్దమ్మతల్లి




పెద్దమ్మతల్లి అమ్మవారు శ్రీశాకాంబరీదేవిగా దర్శనం ఇచ్చారు. ఆషాఢ మాసం చివరి ఆదివారం కావడంతో పండ్లు, కూరగాయలతో అలంకరించారు. అర్చకులు విశేష పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. బోనాలు, తలనీలాలు సమర్పించారు. శివాలయంలోని శివలింగాన్ని కూరగాయలతో అలంకరించి పూజలు జరిపారు. – పాల్వంచరూరల్

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి


జింకలను వీక్షిస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్: కిన్నెరసానిలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. జిల్లాలోని పలు ప్రాంతాలతోపాటు పొరుగు జిల్లాల నుంచి కూడా సందర్శకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. డ్యామ్‌పైనుంచి జలాశయాన్ని, డీర్ పార్కులోని దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. 637 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించగా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.36,720 ఆదాయం లభించింది. 400 మంది బోటు షికారు చేయగా ద్వారా టూరిజం కార్పొరేషన్ సంస్థకు రూ.19,450 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీపై కేసు నమోదు

ఘటనపై పలు అనుమానాలు

తిరుమలాయపాలెం: మండలంలోని కేశ్వాపురం పరిధిలో ఉన్న రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీపై ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విద్యుత్ శాఖ ఏఈ భాస్కర్‌రావు ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. కేశ్వాపురం సీతారామ ప్రాజెక్టు పరిధిలోని 63 కేవీ, 25 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనేక అనుమానాలు..

కేశ్వాపురం సీతారామ ప్రాజెక్టు పరిధిలోని 63, 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారని ఏఈ ఇచ్చిన ఫిర్యాదుపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. సీతారామ ప్రాజెక్టు కాంట్రాక్టర్, ఇరిగేషన్ అధికారులు ఉపయోగించుకున్న ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినడంతో కొద్ది నెలల క్రితం విద్యుత్ శాఖ కాంట్రాక్టర్ రెండు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో సీతారామ కాంట్రాక్టర్ తాను ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్లకు డబ్బులు చెల్లించలేదని నెల రోజుల క్రితం రెండు ట్రాన్స్‌ఫార్మర్లను తీసుకెళ్లినట్లు సమాచారం. దీంతో ఆయా ట్రాన్స్‌ఫార్మర్ల కింద ఉన్న రైతులు తమ పొలాలకు ఇబ్బందులు కలుగుతున్నాయని, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని సీతారామ పనులను అడ్డుకోవడంతో పాటు విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, అధికారులకు ఫిర్యాదులు చేశారు. సమస్య పరిష్కారం కాకపోవడంతో శనివారం విద్యుత్ శాఖ ఎస్‌ఈ శ్రీనివాసాచారిని కలిసి తమ గోడు వినిపించగా ఆదివారం రెండు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి రైతుల సమస్యలను పరిష్కరించారు. చోరీ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేపడితే మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.